క్లుప్తంగా

తీరిన విద్యుత్ వెతలు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు గౌడపాలెం, పంచాయతీ కార్యాలయ ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్యకు తెరపడింది. విద్యుత్ శాఖ అధికారులు రూ.9 లక్షలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందగా మరొకరి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నుదురుపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎన్.హనుమంతురావు(38), టి.ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై పొలం వెళ్లి.. తిరిగి ఇంటికి వస్తున్నారు. గ్రామ శివారులోకి రాగానే రైల్వేస్టేషన్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న హనుమంతురావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులుకూ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతనిని వాహనంలో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సీఐ వీరబాబు ఆదేశాల మేరకు.. ఎస్ఐ వీరనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం శనివారం గుంటూరు తరలించారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షయ నివారణకు టీకా తప్పనిసరి




ఫిరంగిపురం: క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు బీసీజీ టీకా వేయించుకోవాలని వైద్యురాలు శ్వేత తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 187 మందికి డాక్టర్ శ్వేత వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించారు. షుగర్ బాధితులు, గతంలో క్షయ వ్యాధి వచ్చినవారు, వారికి సమీపంలో ఉన్న వారు, 18 ఏళ్లు నిండి బరువు తక్కువగా ఉన్న వారు బీసీజీ టీకా వేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం ఎస్కే మాబు, విజయ్‌కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐరన్ చోరీపై కేసు నమోదు

తాడికొండ: తుళ్ళూరు మండలంలోని ఎల్‌అండ్‌టీ కంపెనీలో రూ.18 వేలు విలువ కలిగిన ఇనుము చోరీపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనురాధ శనివారం తెలిపారు. గత నెల రోజుల లోపు ఈ చోరీ జరిగినట్లు గుర్తించిన ఎల్‌అండ్‌టీ స్టాక్ ఇన్‌చార్జి కిరణ్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మాకు ప్రత్యామ్నాయం చూపండి



మంగళగిరి: తమకు ప్రత్యామ్నాయం చూపి తమ పొలాలను సీడ్ యాక్సిస్ రోడ్డుకు తీసుకోవాలని ఉండవల్లి రైతులు కోరారు. శనివారం మంగళగిరిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న జనసేన కేంద్ర కార్యాలయంలో ఈ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును ఉండవల్లి రైతులు కలిశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. చిల్లపల్లి మాట్లాడుతూ డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి.. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి వేడుకలు

గుంటూరు మెడికల్: అమ్మ కోసం చెట్టు కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని 4వ మండలం అరండల్ పేట వావిలాల సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత శ్యామప్రసాద్ ముఖర్జీ, వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటంకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. పెద్దింటి కృష్ణ చైతన్య, ఈదర శ్రీనివాసరెడ్డి, సుకన్య, వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, పద్మనాభం, వావిలాల సత్యం, యనమండర శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, ప్రకాశరావు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ కృషి

మాజీ ఉప ప్రధానికి ఘన నివాళులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నేతల నివాళి

మంగళగిరి: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం పోరాడిన యోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి కొనియాడారు. శనివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. అక్కడ ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మురుగుడు మాట్లాడుతూ.. పేదరికంలో పుట్టి దేశ ఉప ప్రధానిగా ఎదిగిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఈపూరి ఆదామ్, మల్లవరపు సుధారాణి, గుంటి రాజ్యలక్ష్మి, కురగంటి ఆదామ్, బట్టు రవి పాల్గొన్నారు. అలాగే పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు. చందోలు విక్టర్ పాల్, కలకోటి నాగేశ్వరరావు, రామారావు, శ్యామల, రాజు, దాస్ పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

తాడేపల్లిరూరల్ : భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో క్రిస్టియన్‌పేటలో పార్టీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి విచ్చేసి, జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిహార్‌లో జగ్జీవన్‌రామ్ జన్మించారని, స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ వేత్తగా గుర్తింపు పొందారన్నారు. భారత పార్లమెంట్‌లో 40 ఏళ్లపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు ఈదులమూడి డేవిడ్ రాజు, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, ముదిగొండ ప్రకాష్, మేకా వెంకటరామిరెడ్డి, నాయకులు దాసు, శ్రీనివాస్ మధు, ఉదయరాజు, బాబు, వికాస్, సురేంద్ర, హుస్సేన్, రవి, భాస్కర్, డానియేల్, శ్యామ్, సురేంద్ర పాల్గొన్నారు. ఉండవల్లి హరిజనవాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబేడ్కర్ నగర్‌లో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఉండవల్లి కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, బాలాజీ రెడ్డి, బండుపల్లి అనిల్, నక్కా బాబు, భాజ్యరాజు, జోజిబాబు, నవీన్, వేళంగిణి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అంబేద్కర్ నగర్‌లో..

జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి హరిజనవాడలో కేంద్ర మాజీ మంత్రి, దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జ్యోతిబాసు, సురేష్, లీలాకృష్ణ, నరేంద్ర, కిషోర్, విశ్వనాథం, శ్రీను, సోమారావు, కమలనాథుడు, రమాదేవి, మౌనిక, చాముండేశ్వరి, భార్గవ్, రాము పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ బాటలు

తాడికొండ: బడుగుల అభ్యున్నతికి బాటలు వేసిన ఉన్నతమైన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని స్థానిక జగ్జీవన్‌రామ్ యువ సేవా సమితి సభ్యులు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకొని తాడికొండ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవన్ వద్దగల జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సేవా సమితి సభ్యులు ఉండవల్లి నరసింహారావు, ఈపూరి ఆనందరావు, కట్టెపోగు వీరయ్య, పాలేటి ప్రభుదాస్, ఉండవల్లి జోసఫ్, ఉండవల్లి శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి యువత నివాళి

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు



విజేతలకు బహుమతి ప్రధానం చేస్తున్న నిర్వాహకులు

మంగళగిరి: జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలంటే విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని రూరల్ సీఐ యార్లగడ్డ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నిర్మల ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు లీడర్లగా ఎంపికైన వారికి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మార్చ్ ఫాస్ట్ చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ సీఐ మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన లీడర్లు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలన్నారు. హెచ్‌ఎం సిస్టర్ జ్ఞాన సుందరి గతేడాది క్యాథలిక్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు. పాఠశాలలో స్కౌట్స్ గైడ్స్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేసి, సీఐని ఘనంగా సత్కరించారు.

విత్తన విక్రయ దుకాణాలపై దాడులు



మేడికొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విత్తన విక్రయ దుకాణాలపై తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి నాగరాజు దాడులు చేశారు. మేడికొండూరు గ్రామంలో పలు మందులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అవకతవకలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తుంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని రైతులకు సూచించారు. తనిఖీల్లో అధికారులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' అవగాహన ర్యాలీ



మేడికొండూరు మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీ శనివారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొని, మానవహారం ఏర్పాటు చేశారు. మండల విద్యా శాఖ అదికారి అబ్దుల్ అలీం మాట్లాడుతూ బడీఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, బడి బయట ఉండరాదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన నేను బడికి పోతా కార్యక్రమంలో అందరూ పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఎం మాధవి, సోషల్ వెల్ఫేర్ కె.దివ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతోనే పరిహారం

- జీవాలకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- నష్టపోతున్న పాడి రైతులు



చనిపోయిన గేదె

తాడేపల్లి రూరల్ : వర్షాలు, తుపానుల కారణంగా ప్రమాదవశాత్తు పశువులు విద్యుత్ ఘాతానికి గురవుతుంటాయి. రూ.లక్షలు విలువ చేసే ఎద్దు, పాడి పశువులు అక్కడికక్కడే మృతి చెందిన దాఖలాలు కూడా ఉన్నాయి. వర్షాలు, ఈదురు గాలులుకు విద్యుత్ తీగలు తెగి కింద పడుతుంటాయి. వీటిని గమనించకపోవడంతో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా అనేకమంది క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకుంటుంది. అయితే ఈ పరిహారంపై బాధితులకు అవగాహన లేకపోవడంతో చాలామంది నష్టపోతున్నారు.

ఇలా చేయాలి..

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం కోసం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు అయిన తర్వాత శవ పంచనామా చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్‌శాఖ సహాయక ఇంజినీర్‌కి దరఖాస్తు చేసుకోవాలి. మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐఆర్, పంచనామా నివేదిక, ఆధార్, బ్యాంక్ పుస్తకం తదితర కాపీలను జత చేసి.. విద్యుత్ ఏఈకి అందజేయాలి. ఏఈ నుంచి ఆ పత్రాలు ఏడీఈకి చేరుతాయి. ఉన్నతాధికారులకు అందిన తర్వాత నష్టపరిహారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

వ్యక్తులకు అంగవైకల్యం కలిగితే...

విద్యుత్ ప్రమాదం వల్ల అంగవైకల్యం కలిగితే.. ప్రమాద విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖాధికారులకు తెలియజేయాలి. వైద్యం నిమిత్తం అయిన ఖర్చు బిల్లులు, ఇతర ఖర్చుల వివరాలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జతపరచి.. విద్యుత్ శాఖ ఏఈకి అందించాలి. ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి నష్టపరిహారం మంజూరు చేస్తారు.

మూగ జీవాలు మృతి చెందితే....

పశువులు, విద్యుదా ఘాతానికి గురై మృతి చెందితే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్‌ఓ, తహసీల్దార్‌కు సమాచారం అందించాలి. పశువైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు నిమిత్తం పరిహారం బాధితుడికి అందిస్తారు. పశు వైద్యులు సూచించిన మేరకు నష్టపరిహారం అందుతుంది.

అర్హులకు వెంటనే పరిహారం



విద్యుత్ ప్రమాదాలకు సంబంధించి బాధిత కుటుంబాలు అర్హులైతే పరిహారం తప్పకుండా అందుతుంది. ప్రమాదం జరిగిన స్థాయిని బట్టి పరిహారం ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. మూగ జీవాల విషయంలో పశువైద్యాధికారి ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని పరిగణలోకి తీసుకుంటాం. విద్యుత్ ప్రమాదాల బారిన పడిన వెంటనే అధికారులకు తెలియజేయాలి. గ్రామాల్లో కూడా సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– షణ్ముఖ, ఏఈ, నులకపేట సబ్‌స్టేషన్

ఏబీవీపీ ఆధ్వర్యంలో పోటీలు

ఏఎన్‌యూ: ఏబీవీపీ 75వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు పవన్ కుమార్ తెలిపారు. జూలై 9న వ్యవస్థాపక దినోత్సవాన్ని నేషనల్ స్టూడెంట్స్ డేగా జరుపుతున్నామని, ఈసందర్భంగా ముందస్తుగా విద్యార్థులకు రెండు కిలో మీటర్ల పరుగు, పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, కంటి వైద్య శిబిరం, తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆస్పత్రిలో పలు విభాగాల పరిశీలన

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పలు వైద్య విభాగాలను సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శనివారం పరిశీలించారు. పరిశీలనలో భాగంగా వార్డుల్లో మరుగుదొడ్లలో పేరుకుపోయిన చెత్తను అక్కడ నుంచి తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి ప్రతిరోజూ నాలుగు నుంచి ఐదు వేల మంది రోగులు వస్తున్నారని వారి కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత శానిటేషన్ సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. అత్యవసర చికిత్స విభాగం అడ్వాన్స్‌డ్ ఇంటెన్సివ్ కేర్ వద్ద మరుగుదొడ్లు దుర్గంధపూరితంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారునికి నోటీసు ఇవ్వాలసిందిగా ఆదేశించారు. రెండు ఎగ్జిట్ ఫ్యానులు మరమ్మతులకు గురవడంతో వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా కోరారు. అత్యవసర చికిత్స విభాగం సమీపంలో సీటీ స్కాన్ రూమ్‌లో పలు చోట్ల పెచ్చులు ఊడిపోవడంతో వెంటనే తాపీతో సిమెంట్, కంకర కలిపి డాక్టర్ కిరణ్ కుమార్ సరిచేశారు. మూడేళ్ల నుంచి సీటీ స్కాన్ మూత పడటంతో ఏలుకలు దూరే విధంగా మార్గం ఉండటంతో వాటికి మరమ్మతులు చేసి పరిశుభ్రంగా చేశామని వివరించారు.

కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకా



టీకా వేస్తున్న పశువైద్యురాలు కోటిరత్నం

ఫిరంగిపురం: రేబీస్ వ్యాధి బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడమే జునోసిస్ డే ప్రధాన ఉద్దేశమని పశువైద్యాధికారి కోటిరత్నం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో జునోసిస్ డే సందర్భంగా కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునోసిస్ వ్యాధులంటారన్నారు. 280 రకాల వ్యాధులు జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయని తెలిపారు. వర్షాకాలంలో కుక్కలు ఎక్కువగా కరుస్తాయని, దీంతో కుక్కలకు రేబీస్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. అనంతరం కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పర్వీన్, చలపతి పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు

లాం(తాడికొండ): పెంపుడు కుక్కలకు ఏఆర్‌వీ టీకాలు తప్పనిసరిగా వేయించాలని లాం గ్రామ పశు వైద్యశాల అసిస్టెంట్ డాక్టర్ సౌజన్య అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా లాంలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక టీడీపీ నాయకులు షేక్ అబీదా అలీ, కొల్లకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని, పెంపుడు కుక్కలకు టీకాలు వేయించారు. పాటు పశు పోషకులకు రాయితీ గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంగళశెట్టి సత్యన్నారాయణ, గోలీ నాగేశ్వరరావు, వీఎల్‌ఓ బి.సేవా నాయక్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బీజామృతంతో అధిక పంట దిగుబడి



తయారీ విధానం పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ డైరెక్టర్ హర్షవర్ధన్

ఫిరంగిపురం: బీజామృతంతో పంటను ఆశించే చీడపీడలు తొలిగి.. దిగుబడి అధికంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్స్ వెంకటేశ్వర్లు, అన్నామణి పేర్కొన్నారు. మండల మహిళా సమాఖ్య సమావేశం మండల కేంద్రంలోని మహిళా మార్ట్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డైరెక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతివ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చింతా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులు తమ భూములు సారవంతం చేసుకుంటున్నారని చెప్పారు. పంటలను ఆశించే చీడపీడల నివారణ చర్యలకు సంబంధించి మెలుకువలు తెలియజేశారు. రసాయనాల జోలికి పోకుండా రైతులు కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి పంటను ఆశించే చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం విత్తనశుద్ధి వారోత్సవాల సందర్భంగా బీజామృతం తయారీ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. దానిని తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సమాధానం, మోడల్ మేకర్స్ ఇ. వెంకటేశ్వర్లు, అన్నామణి, డీసీఎంలు రాంబాబు, పీడీసీసీ వెంకటరావు, అడిషనల్ పీడీ నారాయణరావు, సీసీలు లక్ష్మి, మేరి, సుబ్బారావు, ధనమ్మ, పద్మజ, ఎమ్మెస్‌ఓబీలు చిరంజీవి ధనలక్ష్మి జ్యోతి, ఎ.రామకృష్ణ, తిరుపతిరావు, కె.అమల పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి ఉద్యోగుల నివాళి

తాడేపల్లిరూరల్ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం తాడేపల్లి పట్టణంలోని సీఎస్ఆర్ రెసిడెన్సీలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షత వహించగా.. పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు. 2024-26 సంవత్సరానికి నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఆగస్టు 10న జరగబోయే రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ ఉంటుందన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ హెచ్‌డీ ఈరన్న, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ ఆనంద్, క్యాపిటల్ రీజియన్ ప్రెసిడెంట్ వైవీ సుధాకర్ బాబు, క్యాపిటల్ రీజియన్ ట్రెజరర్ డాక్టర్ ఒ.నాగరాజు, కృష్ణా జిల్లా జనరల్ సెక్రటరి ఎం.రాఘవులు, వివిధ జిల్లాలకు చెందిన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చేపట్టాలి



ప్రాంగణంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ ఎస్తేరు సునీల, వినయ్‌కుమార్



శ్రీపూజిత స్కూల్లో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల పేర్కొన్నారు. శనివారం వన మహోత్సవం సందర్భంగా లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎస్తేరు సునీల మాట్లాడుతూ మొక్కలు జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ ఆరోగ్య భద్రతకు పాటు పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగ అధికారి ఎం.వినయ్‌కుమార్, కళాశాల మేనేజర్ డాక్టర్ ఎస్‌పీ వెస్లీ పాల్గొన్నారు.

వన సంరక్షణపై దృష్టి సారించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే వన సంరక్షణపై దృష్టి సారించాలని శ్రీపూజిత స్కూల్ ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శనివారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మానవ అవసరాలకు అడవులను నరికివేయడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటోందని అన్నారు. జూలై నెలలో వేసవిని తలపించే ఎండలకు చెట్ల నరికివేత కారణమన్నారు. మొక్కలకు ప్రాణం ఉంటుందని, మనుషుల వలే అవి కమ్యూనికేషన్ చేసుకుంటాయని పరిశోధనల్లో రుజువైందని వివరించారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.



గ్రీన్ ఇండియా కార్యక్రమ ర్యాలీలో ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: నెహ్రూనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ కింద గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డి.భారతి ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చాటుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. భారతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో డీన్ దుర్గారావు, పీఈటీ రవిబాబు పాల్గొన్నారు.